# పద్మవ్యూహం

రైల్లో: అవును, ఆరోజు వెంకట్రామయ్యగారనే ఆ పెద్ద మనిషి రైల్లో కన్పించి సంగతులన్నీ సాకల్యంగా తెలుసుకొని వాళ్ళింటికి పిలుచుకొని వెళ్ళకపోతే తన స్థితి ఏమైఉండేది ? ... వెంకట్రామయ్యగారిలాంటి సత్పురుషులుండబట్టే దేశం ఈ మాత్రంగానైనా ఉంది! కాని అలాంటి వ్యక్తితోనే నేను ఒక చిన్న అబద్ధం ఆడేను. హైదరాబాదు బయలుదేరింది ఒక ఉద్దేశంతో అయితే ఆయనతో చెప్పింది మరొకటి! "ఏమీ లేదు ... రాజధానీ నగరంచూసి వెళ్ళటానికి వస్తున్నాన"ని చెప్పటంలో ఆయన ఇక్కడ ఏమేమి చూడాలో విడమరచి చెప్పాడు! ప్రసాదరావిచ్చిన వాళ్ళ తమ్ముడి చిరునామా ఎక్కడో జారిపోయింది!

"పోతే పోనియ్‌లే బాబూ! ఈ నాలుగు రోజులూ మాఇంట్లోనేఉండు! అని ఆయన వాళ్ళింటికి ఆహ్వానించాడు —

తనకు తప్పలేదు.

నాకూ వెంకట్రామయ్యగారు కన్పించటం ఒకందుకు మంచిదే అయింది! ఆ ప్రసాదరావు తమ్ముడితో నాకట్టే పరిచయంలేదు. పరిచయం లేకపోయినా స్వభావంలో ప్రసాదరావు లాంటి వాడేనని వాళ్ళూ వీళ్ళూ చెప్పగా విన్నాను. అయినా ప్రసాదరావులో ఏర్పడ్డ సన్నిహిత సంబంధం మరొకరిలో

ఏర్పడటం అసాధ్యం! అతని ప్రోత్సాహం లేకపోతే అసలు తను హైదరాబాదు బయలుదేరి ఉండే వాడేనా ?...

ఏదో 'ఛేంజ్' కావాలట నాకు! తనను గురించి ఎన్నో సంగతులు తెలుసు! 'ఒక నెల రోజులు నువ్వీ గుడివాడలో ఉండొద్దు' అన్నాడు! ఎందుకన్నాడో ఏమో ప్రసాదరావుకే తెలియాలి! బహుశా ప్రసాదరావుకు నేను కోటేశ్వరరావుతో తిరగడం ఇష్టం లేకపోవచ్చు! వాడు చెడిపోయాడట! పెళ్ళాన్ని వదిలేసి వాడు ప్రస్తుతం గుడివాడలో ఉంటూ నాటకాలు ఆడుతున్నాడు! అనసూయ అనే అమ్మాయితో ఉంటున్నాడు! ఒకరోజు వాళ్ళిద్దరు నాళ్ళింటికి భోజనానికి పిలిచారు ... ఈ విషయం ప్రసాదరావుతో చెబితే ... ఐదు నిమిషాలు నాతో మాట్లాడలేదు ... ఏమనుకున్నాడో ఏమో చివరకు వెళ్ళమన్నాడు ... కాని నేనే వెళ్ళలేదు ... ప్రసాదరావుకు నేనంటే స్కూల్లో చదువుకునే రోజుల్నుంచే ఎంతో ప్రేమ! ఇన్ని సంవత్సరాలు గడచినా ... మా మైత్రిలో ఎలాంటి అవాంతరం ఏర్పడలేదు! ... పైగా మరింత పెరిగి పోయింది.

నేను చాలా మంచివాణ్ణని ప్రసాదరావు నమ్మకం!

అందరితోనూ ఇలాగే చెబుతాడు! ఇలా చెప్పేటప్పుడు నాకు ఏమిటోగా ఉంటుంది! ప్రసాదరావు నా మంచితనాన్ని గురించి చెప్పడంలో నాకేమీ అభ్యంతరం లేదు! కాని నా అభ్యంతరాలు ఆయన ఎంత చెప్పినా ఖాతరు చేయడు! పెళ్ళి విషయంలో నీవనుకుంటున్న అభిప్రాయాలు నాకు లేవని ఎన్నో మార్లు చెప్పాను ... కాని వింటేగా ? 'నాకు తెలుసు ముకుందం ... నీకు పద్మలాంటి పిల్ల కావాలి ... దేశం గొడ్డు

పోయిందా ఏమిటి ? ఆ భారం నామీద వదిలేయ్ !' అంటూ ఉంటాడు ! నిజంగా ప్రసాదరావుకు పద్మలాంటి అమ్మాయి కన్పిస్తుందా ? ఆ నమ్మకం నాకు లేదు. కాని ప్రసాదరావుకుంది !

పద్మ ... పద్మ అమ్మ పిలిచినట్టే ... ఓ రేయ్ బాబూ !' అనేది ... తనకంటే ఆమె నాలుగేళ్ళు పెద్దదట ... తను చిన్న వాడు ... అప్పుడు తను ఫస్టియరేగా చదివేది. ఆమె బి. ఏ.!

ఎక్కడెక్కడి ఇంగ్లీషు కవుల కవిత్వాలు విన్పిస్తూండేది ! అర్థం కావడంలేదన్నా వినమనేది. వినేవాణ్ణి. అర్థమయ్యేవి కాదు ... కాని ఇప్పుడో ? ... ఇప్పుడు ఆ పద్మ ఏది? ఆపద్యాలు మాత్రం గుర్తుకొస్తున్నాయి ... అప్పుడు స్ఫురించని అర్థాలు ఇప్పుడు స్ఫురిస్తున్నాయి...

Ask no return for love that is given,
Embracing mistress wife or friend.
Ask no return
on this deep earth or in Pale heaven
Ask no return
fran love that sleeps behind each eyes in double symmtry
Ask no return.

అవునని అప్పుడు అడగలేకపోయాడు ... అమ్మలాగా 'ఒరేయ్!' అంటూ ఉండేది ... చిన్న పిల్లవాడుగా భావించి పక్కన తనను కూర్చుండబెట్టుకొని ఎన్నెన్నో కబుర్లు చెప్పేది ... గంటల

కొలదీ ఆమె మొహంలో మొహం బెట్టి చూచాడు తను. ఎందుకో హృదయం కొట్టుకునేది ... Give all to love-obey thy heart ... ఈ మాట ఎందుకన్నదో ఏమో ?

చదువు మిషమీద మేడమీద కెళ్ళేవాళ్ళం ... అనంతాకాశంలో అగణితమైన నక్షత్రాలు ... నన్ను చదువుకోమని చెప్పి ఆమె పిట్టగోడకానుకొని ఆకాశంవేపు చూస్తూండేది. ఆమె పెదాలుమీద 'పో' కవిత.

But my heart ; it is brighter
Than all of the many stars in the sky

For; it sparkles with Annie it glows with the light of the love of my Annie.

With the thought of the light of the eyes of my Annie.

అలాంటి పద్మను తన చేతులారా పోగొట్టుకున్నాడు. ప్రసాదరావన్నట్టు, నాలో చొరవ తక్కువ. ప్రతి చిన్న విషయాన్ని గంటల తరబడి ఆలోచిస్తాను ... అవును. పద్మ విషయంలో గంటల తరబడిగాదు, రోజుల తరబడి ఆలోచించాను. ఆమె అచ్చంగా అమ్మ లాగా మాట్లాడించటం, అలాగే పిలవటం, అలాగే ప్రేమగా చూట్టం తనకు నచ్చలేదు. అసలు ఆమె " ఒరేయ్ ! అని నన్ను పిలవటం ఇష్టంలేదు. తనేం చిన్నవాడా ? అప్పుడు తనకు పదిహేనేళ్ళు. ఆమె ఎంత పెద్దదయితే మటుకు అంత చిన్నచూపు చూట్టమా అనిపించింది. అలాంటి పద్మకోసం ప్రసాదరావు ఆంధ్రదేశమంతా వెదికితేమాత్రం దొరుకుతుందా ? దొరుకుతుందంటాడు ప్రసాదరావు. పెళ్ళి

విషయంలో నాకున్న అభిప్రాయాలు విని పెదవి విరుస్తాడు. ప్రసాదరావంటే నాకు ప్రాణంతో సమానం.

టికెట్టు కొనిపెట్టి పాతిక రూపాయలు చేతిలోఉంచాడు. తను కాదనలేదు. చెప్పవలసినవి చెప్పి వెళ్ళిపోయాడు. కోటేశ్వ రావు మాత్రం రైలు కదిలేదాకా వున్నాడు. రైలు కదులు తూన్న సమయానికి గుర్తొచ్చింది గాబోలు, "ఒరేయ్ ముకుందం హైదరాబాద్ వెళ్ళాక ఉత్తరం రాయి. నేనూ వచ్చేస్తాను. నేనూ ఏదో ఒక ఉద్యోగం నాక్కూడా దొరక్క పోతుందా? అన్నాడు. నేనేదో ఉండీ ఉండలేక వాడితో అనే శాను. ఉద్యోగ ప్రయత్నంమీద బయలుదేరుతున్నానని, 'సరే' అనటంకంటె ఏదో సమాధానం నాకు వెంటనే స్ఫురించింది కాదు. రైలు బయలుదేరేదాక ప్లాటుఫారంమీద కొంచెం దూరం పరుగెత్తుతూ వచ్చి మరో సంగతి నా చెవినవేసి నిలబడి పోయాడు. రాజేశ్వర్రావు ప్రస్తుతం హైదరాబాదులోనే వున్నాట్ట. ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో వివరాలు చెప్పే అవకాశం లేకపోయింది వాడికి.

రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపూ కోటేశ్వర్రావు కళ్ళలో మెదిలాడు. లక్ష్మిలాంటి పెళ్ళాన్ని వదిలేసి నాటకా లంటూ అనసూయ అనే పిల్లతో ఉంటున్నాడు. వాడి భార్య వాడిని పురుగును చూస్తున్నట్టు చూస్తుందట! అనసూయ వీడిని పువ్వులోపెట్టి పూజిస్తున్నదా అంటే అదీలేదట! నాట కంలో మాత్రం వీడిమీద ప్రేమ ఒలకపోస్తుందట! బయట

పీడం శే విదిలించుక తిరుగుతుందట ! అయినా ఆమె అంటే తన కిష్టమట. పెళ్ళామంటే అరికాలిమంట తలకెక్కుతుందట.

పీడికి ఉద్యోగం చూసిపెట్టాలట ! మరి నాకో ?

* * *

పబ్లిక్ గార్డెన్స్ : పల్లీ లేవో సాబ్ గరమ్ పల్లీలేవో!" అని నాలుగు చక్రాల బండిమీద వేరుశనక్కాయలు అమ్ముకునే కుర్రాడు కేకలేస్తుంటే ఐదారడుగుల దూరంలో పబ్లిక్ గార్డెన్ గేటుపక్కగా నిలబడ్డ నాకు ... "ఉద్యోగాలండోయ్ ! ఉద్యోగాలు — మీకు కావలసిన ఉద్యోగాలు !" అని అరుస్తున్నట్లనిపించింది. కాని కుర్రాడు కేకేసేది. వేరుశనక్కాయలు కొనుక్కోమని !

మరోమారు రాజేశ్వరరావు గుర్తొచ్చాడు! మద్రాసు జీవితం కళ్ళల్లో మెదిలింది. తనూ రాజేశ్వరరావు మెరీనాబీచ్‌లో వేరుకడలై కొనుక్కొని కాఫీకి డబ్బులులేక కార్పొరేషన్ పంపు నీళ్ళు తాగిన రోజులవి.

ఉద్యోగంకోసం రకరకాల వ్యక్తుల్ని కలుసుకుంటూ... రోజులపగిది తిండిలేకుండా 'రేపు'మీద విశ్వాసం ఉంచి మెరీనా గాలి పీల్చిన జీవితం స్మృతిపథంలో తారట్లాడింది.

బి. కాం. ప్యాసైన రాజేశ్వరరావుగారు ఒక టెంపరరీ యల్. డి. సి. ఉద్యోగం...ఆ ఉద్యోగం చేస్తూ అతగాడు తనను రెండుమాసాలు పోషించాడు...ఆ తరువాత...అవును ఆ తరువాత ఒకటి, రెండు, మూడు, రెండు సంవత్సరాల్లో మూడు ఉద్యోగాలు చేశాను. నాన్నకు జబ్బుగా ఉందని వర్తమానం

వస్తే సెలవుపెట్టి వచ్చాను. ఇంటిదగ్గర పరిస్థితులు వివిధ విధాలుగా పరిణమించిన కారణాన తను మళ్ళీ మద్రాసు వెళ్ళలేకపోయాడు. మూడో ఉద్యోగం అలా ఊడిపోయింది.

దాంతో మద్రాసు జీవితం ఆఖరయింది.

పబ్లిక్ గార్డెన్ లోపలకు జనం రావటం అధికమైంది. ఆలోచనలు మానేసి మళ్ళీ ప్రతివ్యక్తి మొహంలో మొహం పెట్టి చూడనారంభించాను. ఊహుఁ...రాజేశ్వరరావు ఇవ్వాళ కూడా కన్పించేట్టులేదు...ఏంచెయ్యాలి? ఈ ఊళ్లో ఏది ఎక్కడుందో, ఎవరు ఎక్కడున్నారో తెలుసుకోవటం కంటే హుసేన్ సాగర్ లో మునకలువేసి ముత్యపుచిప్పలు దొరుకుతాయేమో వెదకటం తేలిక.

అరగంటసేపు అదేపనిగా లోపలికొచ్చే మనుషుల మొహాలు పరీక్షగా చూసేప్పటికి నాకు విసుగుపుట్టింది. ఎందుకైనా మంచిదని నేనూ లోనికెళ్ళాను. అంతటా పచ్చదనం వెల్లివిరిసి వుంది, రకరకాల మనుషులు పచార్లుచేస్తున్నారు. చేతులు చేతులు పుచ్చుకొని భార్యాభర్తలు మనుషులులేని మారుమూల ప్రదేశాలు వెదుక్కుంటున్నారు. ఫౌంటెన్లపక్కన కొందరు అందమైన ఆడపిల్లలు.

మళ్ళీ ఒకసారి అందర్నీ పరీక్షగా చూశాను.

ఈసారి నా నేత్రాలెందుకో రాజేశ్వరరావును వెదకటం మానేసి పద్మకోసం ఆరాటపడ్డాయి. దీనికి కారణం లేకపోలేదు. వికసించిన పూలచెట్ల పక్కన-పచ్చగడ్డిమీద అచ్చంగా పద్మలాంటి అమ్మాయిలు ఒకరిద్దరు కబుర్లు చెప్పుకుంటూ

కన్పించారు. వెనక్కు వెనక్కు తిరిగిచూశాను; కాని వాళ్ళల్లో పద్మ కన్పించలేదు.

ఒకమూలన...పచ్చగడ్డిమీద ఒంటరిగా కూర్చుండి పోయాను.

ఒకటే ఆలోచనలు !

రాజేశ్వరరావును గురించి కాదు – పద్మ గురించి! ఈ జీవితంలో మళ్లీ పద్మ కన్పిస్తుందా ? ఎలా ఉందో ? ఎక్కడుందో ? ఆమెను గురించి ఎవరు చెప్పినవాళ్ళు లేక పోయారు.

అచ్చంగా పద్మలాంటి అమ్మాయి నాకు భార్యగా కావాలంటే ప్రసాదరావు నవ్వుతాడు. చివరకు సరేనంటాడు. కాని ప్రసాదరావుతో యెప్పుడు "తన పక్కన కూర్చోబెట్టు కొని కబుర్లు చెబుతూ ప్రేమగీతాలు విన్పించిన ఆ పద్మే నాకు భార్యగా కావాల"ని చెప్పలేదు! ఏమో! ఆమె ఎక్కడున్నదో ? పెళ్ళయ్యే ఉంటుంది...బి యే. ప్యాసై ఏదైనా ఉద్యోగం కూడా చేస్తుందేమో ?

తలపైకెత్తి నాలుగువైపులా చూశాను. అంతటా ఆనందం వ్యాపించి ఉంది. చెట్టునుంచి పూలు కిందపడు తున్నాయి. కబుర్లు చెప్పుకుంటున్న అందమైన అమ్మాయిలు హాసపరిహాసాలాడుకుంటూ బిగ్గరగా నవ్వుకుంటున్నారు.

పశ్చిమాన సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఇంకొంచెం సేపట్లో అంతటా అంధకారం అలుముకుంటుంది. ఇక మిగిలే దేమిటి? నిశ్శబ్దత, ఎందుకో నా పెదవులమీద ఈ మాటలు దొర్లిపోయాయి.

For birth hath in it self the germ of death
But death hath in it self the germ of birth
For there is nothing live but somtimes oils.
And than is nothing dies but sometimes lives.

హిమాయిత్ నగర్: "ఇదే వీరరాఘవయ్యగారిల్లు" అని అన్నారు వెంకట్రామయ్యగారు. హిమాయత్ నగర్ చౌరస్తాకు వందగజాల్లో వీధి మలుపుమీద కొత్తగా కట్టిన డాబాను చూపిస్తూ– "నిన్ను గురించి అన్ని విషయాలూ చెప్పానులే. సాయంత్రం సరిగా ఐదుగంటలకు వచ్చెయ్! నేను పంపించానని చెప్పు; చాలు. ఇప్పుడాయన ఇంట్లో ఉండడు. ఆయన కెన్ని పనులు? తీరికలేని మనిషి..." అని పరిచయం చేసాడు. ఆ తీరిక లేని వీరరాఘవయ్యను గురించి!

ఇద్దరం ముందుకు సాగిపోయాం. నేను సరేనన్నాను, అసక చేసేదేముంది? పొరపాటు చేశాక...తప్పదు. మరి అనుభవించాలి. ఏమీలేదు, వెంకట్రామయ్యగారు భోజనం కూడా మా యింట్లోనే చేస్తూవుండు అని అనటం ఆలస్యం, నాజేబిలో ఉన్న ఇరవయ్ రూపాయలు తీసి ఆయన కిచ్చే "ఉంచండి" అన్నాను.

"అబ్బే అబ్బే ఎందుకూ ?" అని అంటూనే చేయిచాచి ఆ డబ్బు ఆయన పుచ్చుకున్నాడు. నా దగ్గిర చిల్లికానీ మిగల్లేదు. ఇది దూరాలోచనలేని పనికదూ మరి ?

ఈ ఊళ్లో ఉండటానికి మనస్కరించలేదు. తిరిగి వెళ్ళిపోవాలంటే చేతిలో డబ్బులేదు, "ఒక్క పదిరూపాయ లివ్వండి.

నే వెళ్ళిపోతాను" అని వెంకట్రామయ్యగారిని అడగలేక పోయాను! మరి ఎలా ఈ ఊళ్లో ఉండటం ?

అందుకనే వెంకట్రామయ్యగారిని ధైర్యంచేసి అడిగాను. "చూస్తే మీకు తెలిసినవాళ్ళు చాలామంది ఉన్నట్టున్నారు ఈ ఊళ్ళో! ఉద్యోగం ఒకటి ఇప్పించే ఏర్పాటు చెయ్యండి. మీ సలహా ప్రకారం ఈ ఊళ్ళోనే ఉండిపోతాను."

"దానికేం దానికే!" అన్నాడాయన. ఎవరెవరు తనకు తెలుసునో హోదాలతో సహా వివరించి చెప్పాడు. ఆ చెప్పిన సగంమంది విషయంతో నాకు సదభిప్రాయం లేదు. కాని వాళ్లందరూ చాలా గొప్పవాళ్ళట !

వెంకట్రామయ్యగారు నాకు యిప్పించిన ఉద్యోగ మేమిటంటే వీరరాఘవయ్యగారి పదేళ్ళ పిల్లకు రోజూ ఒకగంట లెక్కలు చెప్పాలట. ట్యూషనుఫీజు పదిరూపాయలు.

"అబ్బే! అసలు విషయం అదికాదు, నే నాలోచించింది. ముందు ఈ రూపేణా ఆయనతో నీకు పరిచయం కలగటం! ఆయన్ను ఈ ఊళ్ళో మినిష్టర్లుసైతం గౌరవిస్తారు. ఒక్క చిక్కడపల్లిలోనే నాలుగిళ్ళు ఉన్నాయి. ఇక్కడికి ఇరవైమైళ్ళ దూరంలో పాతికెకరాల పొలముంది. ఆయన పెద్దబ్బాయికి ఐదొందల ఉద్యోగం. ఏమో ఎవరుచూశారు. ఆయన దృష్టిలో పడితే నాకూ అంత పెద్ద ఉద్యోగం యిప్పించవచ్చు."

ఇదీ వెంకట్రామయ్యగారి వాదన! ఆయనతో వాదించి లాభంలేదని వీరరాఘవయ్యగా రమ్మాయికి ట్యూషన్ చెప్పటానికి ఒప్పుకున్నాను.

సాయంత్రం అయిదుగంటలు !

వీరరాఘవయ్యగారింట్లో !

ఎంత అందమైన సోఫాలు !

గోడలమీద దేశనాయకుల ఫొటోలు!

ఐదూ ఐదునిమిషాలకు వీరరాఘవయ్యగారు లోనికి కబురంపగా బయటికొచ్చారు.

నా వివరాలు అడిగారు. ఆ తరువాత ట్యూషన్ సంగతి.

"అవునబ్బాయ్! వెంకట్రామయ్య అయిదురూపాయలిస్తే చాలన్నాడు. నేనే పంపిస్తా నన్నాను. ఐదుకే చెప్పేవాళ్ళున్నారు. ఉద్యోగం లేక ఎంతమంది బజార్లు పట్టుక తిరగటంలేదు. కాని నా హోదాకు ఐదు చాలా తక్కువనిపించింది. ఎందుకూ? ఒకామె ఇంగ్లీషు చెబుతున్నది. ఆమెకూ పదే యిస్తున్నా! మాలాంటివాళ్ళకు ఈ రకంగా సహాయం చేయాలని నా అభిలాష" అని అంటూ ఆయన చేతిగడియారం చూసుకున్నాడు.

"ఇప్పుడు అమ్మాయి ఇంగ్లీషు పాఠం చెప్పించుకుంటున్నది. అరగంటలో అయిపోతుంది. అప్పటిదాకా ఉంటుందిగా" అని అంటూ సమాధానం చెప్పేలోపునే ఆయన లేచి లోనికెళ్ళిపోయారు!

నేను లెక్కల్ని గురించి ఆలోచించసాగేను.

మొదటనుంచీ నాకు లెక్కలంటే మహాభయం. లెక్కల్లో నాకు సున్నాలు వచ్చేవి. ఈ అమ్మాయికి లెక్కలు చెప్పటం ఎలాగు ?

ఆలోచిస్తున్నాను.

ఏను రూపాయలిస్తే చాలునని సిఫారసు చేసిన వెంకట్రామయ్యగారు గుర్తుకొచ్చారు. పదిరూపాయలిచ్చి నాలాంటి వాళ్ళకు సహాయపడాలని అభిలషించే వీరరాఘవయ్య గారి మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఇంగ్లీషు చెబుతున్నావిడకు కూడా పదిరూపాయ లేసట యిచ్చేది. తనకెలాగు బుద్ధిలేదు. ఆమె కెలా లేదంట?

ఐదున్నరయింది.

ఆమె బయటకొచ్చింది.

"రండి మేష్టరుగారూ!" అని ఆమె వెనుకనుంచి వీర రాఘవయ్యగారి పదేళ్ళ కూతురి గొంతు విన్పించింది.

అప్పుడే వీరరాఘవయ్యగారు మరో గదిలోనుంచిబయటి కొస్తూ "వెళ్ళునాయనా! లోనికెళ్ళు" అని అన్నాడు.

కాని నేను ఎవరిమాటలూ వినలేదు. ఇంగ్లీషుపాఠంచెప్పి వెళ్ళిపోతున్నావిడిని పరీక్షగా చూస్తున్నాను. అప్పటికే ఆమె పదిగజాల దూరం వెళ్ళిపోయింది. నేను ఒక్కపరుగున బయట కెళ్ళి "పద్మా!" అన్నాను. నడిబజారులో ఆమె ఠక్కున ఆగి పోయింది.

"ఎవరు? ము . . .కుం . . . దం . . . ! ఆమెపెదాలు వణికాయి. అమాంతం వెళ్ళి ఆమెను కౌగలించుకొని బిగ్గరగా ఏడవాలనిపించింది.

దగ్గరగా వెళ్ళి నిలబడ్డాను. ఆమె కళ్ళవెంట నీళ్ళు! అదే పనిగా కారుతున్నాయి.

ఒక నిమిషంపాటు నేను మాట్లాడలేక పోయాను.